# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-10-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు నుంచి రెండు రోజుల పాటు పర్యటిస్తారు.**

**2. కృష్ణా, గోదావరి, పెన్నా, కావేరి నదుల అనుసంధానం ద్వారా ప్రయోజనం కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**3. మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంపొందించి, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**

**4. సింగరేణి కార్మికులకు దసరా కానుకగా 96 కోట్ల రూపాయల ప్రోత్సాహకాలను ఇస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు నుంచి రెండు రోజుల పాటు పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా సాయంత్రం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న అనంతరం ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకుంటారు. కాగా రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఆలయంలో అరగంట పాటు భక్తుల దర్శనాలను నిలిపివేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ తెలిపారు. రాష్ట్రపతి దర్శనం అనంతరం భక్తులకు యథావిధిగా దర్శనాలు కొనసాగుతాయని వెల్లడించారు.

--------------------------

విజయవాడ పున్నమి ఘాట్‌లో నిర్వహించిన విజయవాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తమిళనాడు ముఖ్యమంత్రి సి.విజయ్ జోసెఫ్ నిన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఇరువురు ముఖ్యమంత్రులు ప్రసంగించారు. తమిళనాడు రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా విజయ్ పనిచేస్తున్నారని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పెన్నా, గోదావరి, కృష్ణా, కావేరి నదులను అనుసంధానం చేస్తే నాలుగు రాష్ట్రాలకు ప్రయోజనం కలుగుతుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్..30..సెకన్లు

అనంతరం తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ జోసెఫ్ మాట్లాడుతూ, విజయవాడ ప్రజలను కలుసుకోవడం

చాలా సంతోషంగా ఉందన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలుపుతూ,

వాయిస్..25.. సెకన్లు

---------------------------

సింగరేణి కార్మికులకు దసరా కానుకగా 96 కోట్ల రూపాయల ప్రోత్సాహకాలను ఇస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రి, సింగరేణి ప్రాంత శాసనసభ్యులతో కలిసి ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. 38 వేల 737 మంది శాశ్వత ఉద్యోగులకు సగటున లక్షా 53 వేల 912 రూపాయల చొప్పున, 29 వేల 717 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి 5 వేల 5 వందల రూపాయల చొప్పున దసరా ప్రోత్సాహకాలను అందించనున్నట్లు తెలిపారు.

---------------------------

మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంపొందించి, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పెద్దమైనవానిలంకలో సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన బోట్లు, వలలను కేంద్ర మంత్రి నిన్న మత్స్యకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పెద్దమైనవానిలంక మత్స్యకారుల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని తెలిపారు. సముద్ర కోత నివారణకు గోడ నిర్మాణం, డిజిటల్ భవనం, ఇళ్లకు సోలార్ విద్యుత్ సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో శ్రీ కనకదుర్గమ్మవారు మహాచండీ దేవి అవతారంలో ఈరోజు భక్తులకు దర్శనమిస్తున్నారు. దీనిపై మా ఆకాశవాణి ప్రతినిధి మరిన్ని వివరాలను అందిస్తారు.

వాయిస్ ..30.. సెకన్లు

ఇదిలా ఉండగా శ్రీశైలక్షేత్రం దసరా మహోత్సవాలలో నిన్న భ్రమరాంబికాదేవి చంద్ర ఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే తెలంగాణలో బతుకమ్మ సంబరాల్లో భాగంగా ఈరోజు అట్ల బతుకమ్మను నిర్వహిస్తున్నారు.

---------------------------

మహిళలు, బాలింతలు, కిశోర బాలికలకు నాణ్యమైన పోషకాహారం అందించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. పోషకాహార సేవలపై విశాఖపట్నంలో నిర్వహించిన సాంకేతిక సంప్రదింపుల సదస్సులో ఆమె నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రాష్ట్రంలో పోషకాహార లోపాలు, రక్తహీనత నివారణకు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి చెప్పారు. పట్టణ ప్రాంతాల్లోని వలస కుటుంబాలు, పనిచేసే మహిళలకు పోషకాహార సేవలను చేరువ చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ తెలిపారు. ఏలూరు నగరంలోని మూడు ప్రాంతాల్లో 2 కోట్ల 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న రహదారి పనులకు స్థానిక శాసన సభ్యులు రాధాకృష్ణయ్యతో కలిసి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ మాట్లాడుతూ,

వాయిస్ ..30..సెకన్లు

---------------------------

ప్రభుత్వ సేవల్లో నాణ్యత, భద్రత, సౌలభ్యాన్ని పెంచేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రభుత్వ ధ్రువపత్రాల భద్రత, మన్నికను పెంచే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌ను హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రి నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు విద్య, ఉద్యోగ, ఇతర అధికారిక అవసరాలకు సంబంధించిన పత్రాలు ప్రజల జీవితాల్లో ఎంతో కీలకమని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల సన్నాహక అంశాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ సీనియర్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. అమరావతిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆయన నిన్న సమావేశమయ్యారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి మధ్య బంగాళాఖాతం వరకు ఆవరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు మేఘావృతమైన వాతావరణం ఉంటుందని పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

మరోవైపు తెలంగాణలోనూ రానున్న నాలుగు రోజులపాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని బీసీ వర్గాల కోసం త్వరలో ప్రత్యేక బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురానున్నట్లు భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, బీసీల రాజకీయ, ఆర్థిక, విద్యా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

====================